క్లుప్తంగా

కృష్ణాలయంలో పూజలు



పూజలు అందుకుంటున్న శ్రీకృష్ణుడు

మల్కాపురం: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా 61వ వార్డు మల్కాపురం గొల్లవీధిలోని కృష్ణ మందిరంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీకృష్ణుడికి తులసి,సుగంధ పుష్పాలతో పూజలు చేశారు. అనంతరం పాలు,పెరుగుతో అభిషేకించారు.మధ్యాహ్నం సుమారు 2 వేల మందికి భారీ అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం స్వామిని పుర వీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగించారు. శ్రీ విజ్ఞాన మండలి యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఐదు రోజుల పాటు నిర్వహించనున్నారు.

చల్లగ చూడు.. సిరుల తల్లీ

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణ మాసోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు ఆదివారంతో 24వ రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వర సుస్వరాల మధ్య పూజలు ప్రారంభించారు. 12 మంది ఉభయ దాతలు పాల్గొన్నారు.

80 కాదు.. 40 అడుగులే..?

- 'మాస్టర్ ప్లాన్'కు తూట్లు
- ఎన్ఎస్‌టీఎల్ – సింహాచలం రోడ్డుపై రాజకీయం
- నాడు 80 అడుగుల రోడ్డు విస్తరణకు ఆటంకాలు
- నేడు 40 అడుగులకు పరిమితం చేసేలా కసరత్తు
- కూటమి నేతల కనుసన్నల్లో అధికారుల పరిశీలన
- ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేందుకు నిర్వాసితుల వెనుకంజ
- నిధులు కొల్లగొట్టేందుకు కూటమి నేతల కుయుక్తులు

ఎన్ఎస్‌టీఎల్ పక్క నుంచి గోపాలపట్నం–సింహాచలం రోడ్డుకు అనుసంధానంగా 80 అడుగుల మేర రహదారి విస్తరించాలనే 'మాస్టర్ ప్లాన్'కు తూట్లు పడుతున్నాయి. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని గత ప్రభుత్వ హయాంలో రహదారుల విస్తరణకు ప్రాధాన్యం ఇచ్చారు. కానీ, నేడు కూటమి నేతలు స్వలాభాల కోసం కుయుక్తులు పన్నుతుండడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 80 అడుగుల రహదారిని 40 అడుగులకే పరిమితం చేయడానికి పావులు కదపడంతో పాటు నిర్వాసితులకు పరిహారం కోసం చేపట్టిన సర్వేలోనూ కూటమి నేతలు పెత్తనం చేస్తుండడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. – విశాఖ విద్య



ఎన్ఎస్‌టీఎల్ వద్ద గతంలో విస్తరించిన 80 అడుగుల రహదారి



గతంలో భూసేకరణ చేసి విస్తరించకుండా వదిలేసిన ప్రాంతం



విస్తరణ చేయాల్సిన రహదారి

కూటమి నేతల కనుసన్నల్లోనే సర్వే

90వ వార్డు పరిధి పంచతత్వ పార్కు నుంచి కుమారి కల్యాణ మండపం వైపు 40 అడుగుల మేర రహదారి విస్తరణ పనులు చేపట్టే క్రమంలో నిర్వాసితుల వివరాలపై ప్రస్తుతం సర్వే చేస్తున్నారు. టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ఇంజినీరింగ్ శాఖల, ఆధ్వర్యంలో మూడు బృందాలుగా ఏర్పడి సర్వే నిర్వహిస్తున్నారు. రోడ్డు విస్తరణకు ఎక్కడెక్కడ ఎంత మేర స్థలం అవసరం ఉంటుంది.. ఎన్ని ఇళ్లు తొలగించాలనే దానిపై వివరాలు సేకరిస్తున్నారు. నిర్వాసితులుగా గుర్తించిన వారి నుంచి ఇళ్లు, వారి ఆస్తికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు కూడా సేకరిస్తున్నారు.అయితే ఇదంతా కూటమి నేతల కనుసన్నల్లో జరుగుతుండడంపై కొంతమంది అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సర్వేకు వచ్చినవారితో కూటమి నాయకులు కూడా ఉండటంతో వారిని చూసిన ఇళ్ల యజమానులు తమ ఆస్తి పత్రాలు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. అధికారిక సర్వేలో కూటమి నాయకులను భాగస్వాములు చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



90వవార్డులో రహదారి విస్తరించాల్సిన ప్రాంతం

గత ప్రభుత్వంలో పక్కా ప్రణాళిక

ఎన్ఏడీ–గోపాలపట్నం బీఆర్‌టీఎస్ రోడ్‌కు ప్రత్యామ్నాయంగా జాతీయ రహదారి నుంచి సుసర్ల కాలనీ, లక్ష్మీనగర్, ఇందిరానగర్, నర్సింహనగర్ మీదుగా కుమారి కల్యాణ మండపం వద్ద సింహాచలం రోడ్‌కు అనుసంధానం చేసేలా రహదారి విస్తరణ పనులు చేపట్టారు. జాతీయ రహదారి వద్ద ఎన్ఎస్‌టీఎల్ పక్క నుంచి వంశీసూపర్ మార్కెట్ వరకు కిలోమీటర్ మేర 80 అడుగుల రహదారి విస్తరణ పనులు పూర్తయ్యాయి. అదే విధంగా కుమారి కల్యాణ మండపం వైపు వంద మీటర్ల మేర రోడ్డును విస్తరించారు. అటు, ఇటు మధ్యలో ఇంకా సుమారు రెండు కిలో మీటర్ల మేర రహదారి విస్తరించాల్సి ఉంది.వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రణాళిక సిద్ధం చేసినా కూటమి నేతల కుళ్లు రాజకీయాలతో అప్పట్లో పనులు నిలిచిపోయాయి.

భవిష్యత్ అవసరాలపై శ్రద్ధ ఏది?

ఎన్ఏడీ నుంచి గోపాలపట్నం వరకు గల బీఆర్‌టీఎస్ రోడ్‌పై వాహనాల రద్దీతో ప్రస్తుతం తీవ్రమైన ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళలో అయితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. ఎన్ఏడీ ఫ్లై ఓవర్ నుంచి సింహాచలం రోడ్ వరకు ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోతుంటాయి. 80 అడుగుల రోడ్డు విస్తరణ పూర్తయితే ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోతాయని అంతా భావించారు. బీఆర్‌టీఎస్ రోడ్డుకు ప్రత్యామ్నాయంగా ఉండే ఈ దారిలో ఆర్టీసీ బస్టాండ్, బిర్లా జంక్షన్ నుంచి సింహాచలం వైపు వెళ్లే వాహనాలను మళ్లించడం ద్వారా ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించేది. అంతేకాకుండా ప్రతీ ఏటా నిర్వహించే సింహగిరి ప్రదక్షిణ సమయంలో కూడా భక్తులకు ఈ రహదారి ఎంతో సౌలభ్యంగా ఉండేది. కానీ, కూటమి నేతల కుళ్లు రాజకీయాలతో భవిష్యత్‌లో ట్రాఫిక్ సమస్య మరింత జటిలమయ్యే అవకాశం ఉందని ఈ ప్రాంత వాసులు అంటున్నారు.


కార్పొరేటర్ లక్ష్మణరావుకు అభినందనల వెల్లువ



కార్పొరేటర్ లక్ష్మణరావును సత్కరిస్తున్న శెట్టిబలిజ సంక్షేమ సేవా సంఘం సభ్యులు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావును వార్డు పరిధిలోని శెట్టిబలిజ సంక్షేమ సేవా సంఘం సభ్యులు అభినందనలతో ముంచెత్తారు. త్రినాథపురం గ్రామంలో ఆదివారం నిర్వహించిన శెట్టిబలిజల ఆత్మీయ సమావేశంలో కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శెట్టిబలిజ సంక్షేమ సేవా సంఘం సభ్యులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా తమ సంఘానికి సొంత భవనం నిర్మించాలని ప్రజాప్రతినిధుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగామని, గెలిచిన తర్వాత ఆ హామీను గాలికి వదిలేశారన్నారు. కానీ కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు కార్పొరేషన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు తమ సంఘానికి సామాజిక భవనం నిర్మించడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించి తమ ప్రాంతాన్ని అభివృద్ధి చేశారని సంతోషం వ్యక్తం చేశారు. కార్పొరేటర్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు నిరంతరం కృషి చేస్తున్నానని, ఇప్పటికే దాదాపు 95 శాతం హామీలు నెరవేర్చానన్నారు. మిగిలిన హామీలను కూడా త్వరలోనే నెరవేరుస్తానని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు సత్యనారాయణ, ఇతర నాయకులు సూర్యనారాయణ, కనక, శివ, మధు, శెట్టిబలిజ సంక్షేమ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వీధి దీపాలు వెలిగించరూ!



ప్రకాష్‌నగర్‌లో వెలగని వీధిలైట్లు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు ప్రకాష్‌నగర్ పోలమాంబ అమ్మవారి ఆలయం వద్ద 12 రోజుల నుంచి వీధిలైట్లు సరిగ్గా వెలగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం కావడంతో చీకటి పడితే పాములు తదితర విషసర్పాల సంచారం అధికంగా ఉండడంతో వీధుల్లో ప్రయాణించాలంటే భయమేస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొత్తం 45 వీధి దీపాలు ఉన్నా వాటిలో సుమారు 15 వరకు వెలగడంలేదని, సమస్యపై పలుమార్లు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు త్వరితగతిన స్పందించి వీధి లైట్లు వెలిగేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆత్మీయ కలయిక.. అపురూప వేడుక



నాటి ఉపాధ్యాయులతో ఎస్ఈ రైల్వే పాఠశాల 1999-2000 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

కంచరపాలెం: మర్రిపాలెం ఎస్ఈ రైల్వే ఉన్నత పాఠశాలలో 1999–2000 ఏడాదిలో టెన్త్ చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఆదివారం స్థానిక వుడా కల్యాణ మండపంలో కలుసుకుని సందడి చేశారు. 25 ఏళ్ల నాటి జ్ఞాపకాలు, అనుభవాలను చిన్ననాటి స్నేహితులతో పంచుకున్నారు. వివిధ రంగాల్లో స్థిరపడిన వారంతా ఆత్మీయ సమ్మేళనంలో సందడి చేశారు. మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. ముందుగా అప్పటి ఉపాధ్యాయులు సావిత్రి, సుశీల, అరుంధతి, ప్రసాదరావు, రమేష్, జయలక్ష్మి, లక్ష్మి, వసంత శ్రీనివాసరావు, లక్ష్మణరావు, మల్లేశ్వరరావు, సుజాత, గురునాథ్, సీతాలక్ష్మి, తులసీరావులను ఘనంగా సత్కరించుకున్నారు. అనంతరం ఆటపాటలు, విందుతో సందడి చేశారు.

23న జాబ్ డ్రైవ్

సీతంపేట: డాటాప్రో కంప్యూటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ నెల 23న జాబ్ డ్రైవ్ నిర్వహించనున్నట్టు సంస్థ డైరెక్టర్ రంగినేని సాయిప్రసాద్ తెలిపారు. శంకరమఠం రోడ్‌లోని సంస్థ కార్యాలయంలో ఆదివారం కార్యక్రమ పోస్టర్లు ఆవిష్కరించారు. ప్రతి నెలా మూడో శనివారం జాబ్ మేళా నిర్వహిస్తున్నామని, ఈసారి ప్రభుత్వ సెలవు కారణంగా కార్యక్రమాన్ని నాలుగో శనివారానికి మార్చినట్టు చెప్పారు. సంస్థ కార్యాలయంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జాబ్ మేళా జరుగుతుందని, మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్, బెలామాంక్స్, ఆల్ హాండ్స్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్, కాన్‌సెంట్రిసిక్స్, టాటా ఎలక్ట్రానిక్స్ వంటి కంపెనీలు పాల్గొంటాయన్నారు.

దంచికొట్టిన వాన



ఐవోసీ సేవా మార్గంలో నిలిచిన వర్షపు నీరు, వ్యర్థాలు



నౌసేనాబాగ్ ప్రవేశం మార్గం వద్ద నిలిచిన బురుదనీరు



మల్కాపురం మరిడిమాంబ ఆలయం వద్ద నిలిచిన మురుగు నీరు

- భారీ వర్షానికి పొంగిన గెడ్డలు
- ముంపునకు గురైన పలు ప్రాంతాలు
- ఇళ్లలోకి చేరిన మురుగు,వర్షపు నీరు
- ఇబ్బంది పడ్డ శ్రీరామ్‌నగర్ వాసులు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో వర్షం దంచికొట్టింది. శనివారం సాయంత్రం ప్రారంభమైన వర్షం కుమ్మేసింది. ఆగి ఆగి భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాలువలు పొంగిప్రవహించాయి. రోడ్లపైకి భారీగా వరదనీటితో పాటు మురుగునీరు పోటెత్తింది. దీంతో జనజీవనం స్తంభించింది. లోతట్టు, కొండవాలు ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

ఇదీ పరిస్థితి

జీవీఎంసీ 58వ వార్డు పరిధి శ్రీరామ్‌నగర్ ప్రాంతంలోని గెడ్డ ఆదివారం ఉదయం నుంచి తెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి వరదనీరు పొంగింది. శ్రీరామ్‌నగర్ గెడ్డను ఆనుకుని ఉన్న పలు నివాసాల్లోకి బురద,మురుగు నీరు చేరింది.ఇక్కడ నేవల్ అధికారులు గెడ్డపై వంతెన నిర్మించడం, గెడ్డలో నీరు పోయేందుకు చిన్న పైపు అమర్చడంతో తరుచూ ఇక్కడ గెడ్డ పొంగుతోందని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు.

- 61వ వార్డు మల్కాపురం మరిడిమాంబ ఆలయానికి సమీపంలోని గెడ్డ ఉప్పొంగింది.దీంతో మురుగు నీరు గెడ్డకు ఆనుకుని ఉన్న నివాసాల ముందు,సేవా మార్గంలో నిలిచింది.దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడింది.

ఐవోసీ మార్గంలో...

భారీ వర్షానికి ఐవోసీ సేవా మార్గం జలమయమైంది. విశాలమైన గెడ్డ ఉన్నా నీరు పోయే మార్గం సరిగ్గా లేకపోవడంతో గెడ్డ పొంగి రోడ్డుపైకి నీరు చేరింది. దీంతో లారీల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. అలాగే ఐవోసీ సంస్థలోకి నీరు భారీగా చేరింది.



శ్రీరామ్‌నగర్‌లో ఇంట్లోకి చేరిన నీటిని బయటకు పంపిస్తున్న నివాసితుడు



జోరుగా కురుస్తున్న వర్షం



భారీ వర్షానికి శ్రీరామ్‌నగర్‌లో ఇంట్లోకి చేరిన మురుగునీరు



మరమ్మతులు చేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది



52వ వార్డు కరాసలో ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డ

మల్కాపురం నౌసేనాభాగ్ కాలనీ రోడ్లపై భారీగా వరదనీరు ప్రవహించింది. కాలనీ రక్షణ గోడకు ఆనుకుని ఉన్న పెద్ద కాలువలో వ్యర్థాలు భారీగా చేరిపోవడంతో కాలువ పొంగి నీరు రోడ్డుపై ప్రవహించింది. దీంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందిపడ్డారు.

విద్యుత్ స్తంభాలపై కూలిన చెట్టు

గోపాలపట్నం: బంగాళా ఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం వల్ల గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఉదయం చిరుజల్లులతో ప్రారంభమైన వర్షం మధ్యాహ్నం తర్వాత భారీ వర్షంగా మారింది. ఈ వర్షంతో రహదారులు జలమయమయ్యాయి. ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

జీవీఎంసీ 89వ వార్డు చంద్రనగర్ యర్ర చెరువు వద్ద రజక కాలనీలో భారి వృక్షం విరిగి రెండు విద్యుత్‌స్తంభాల మధ్య విద్యుత్ తీగలపై పడింది. దీంతో విద్యుత్ స్తంభాలు విరిగి పోయాయి. ఆందోళనకు గురైన స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారమివ్వడంతో వెంటనే స్పందించారు.విద్యుత్ సరఫరా నిలిపివేసి చెట్టు తొలగించేశారు. విద్యుత్ స్తంభాలను మార్చే పనులు రాత్రి 9 గంటలకు పూర్తయ్యాయి. ఆ తర్వాత విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

విశాఖ విద్య: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. 52వ వార్డు గౌరీనగర్ రిక్షా కాలనీ, గణేష్‌నగర్ వరద ముప్పు ఉన్న ప్రాంతాలను నగర మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పరిశీలించారు. గౌరీనగర్, గణేష్ నగర్ ప్రాంతాలకు ఆనుకుని ఉన్న గెడ్డ పొంగడంతో మురుగు నీరు కాలనీలోకి చేరింది. కాలనీలో పేరుకుపోయిన మురుగు నీరు తొలగించేందుకు శ్రీధర్ నగరపాలక సంస్థ యూజీడీ సిబ్బందితో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు.

కంచరపాలెం:జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధిలోని చాకలిగెడ్డ, ముత్యమాంబకాలనీ, పైడిమాంబకాలనీ, దయానందనగర్, రాజీవ్‌కాలనీ జలమయమయ్యాయి. దయానందనగర్ రైల్వే కెనాల్ వద్ద చెత్తచెదారాలు అడ్డంగా నిలిచిపోవడంతో గెడ్డలు పొంగి ప్రవహించాయి. కార్పొరేటర్ శరగడం రాజశేఖర్ జీవీఎంసీ జోన్-5 జెడ్సీ రాముతో కలిసి వార్డులో సహాయక చర్యలు చేపట్టారు.



భారీ వర్షానికి ముంపునకు గురైన శ్రీరామ్‌నగర్ ప్రాంతం



డ్రైనేజీలను పరిశుభ్రం చేయిస్తున్న మాజీ డిప్యూటీ మేయర్ శ్రీధర్